క్లుప్తంగా

చెన్నూరు తహసీల్దార్‌గా మహమ్మద్ అలీఖాన్



చెన్నూరు : కమలాపురం తహసీల్దార్‌గా ఉన్న పఠాన్ మహమ్మద్ అలీఖాన్ బుధవారం చెన్నూరు తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ సరస్వతి కమలాపురం తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. మహమ్మద్ అలీఖాన్ మాట్లాడుతూ మండలంలో ప్రజా సమస్యలపై వచ్చే ఫిర్యాదుల పట్ల ఎప్పటికప్పుడు సిబ్బందితో చర్చించి ఆ పనులను త్వరగా పూర్తయ్యే విధంగా చూస్తానన్నారు.

కమలాపురానికి సరస్వతి



కమలాపురం : మండల తహసీల్దార్‌గా సరస్వతి బుధవారం బాధ్యతలు చేపట్టారు. చెన్నూరు తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఆమె బదిలీపై వచ్చారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరు తమ పరిధిలోని సచివాలయాలు, కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సమయ పాలన పాటించి ప్రజలకు సేవ చేయాలని సిబ్బందికి సూచించారు.

పీహెచ్‌సీ తనిఖీ

వేంపల్లె : మండలంలోని తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా మెడికల్ అండ్ హెల్త్(డీఎంహెచ్‌ఓ) అధికారి డాక్టర్ నాగరాజు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంపై సిబ్బందిని అడిగి తెలుసుకుని పలు రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అంతేకాక ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌పై ఆరా తీస్తూ.. గర్భిణులు, బాలింతలు, రక్తపోటు, మధుమేహం వ్యాధిగ్రస్తులు, సాధారణ ఓపీ విభాగాలలో అందుతున్న సేవలను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుధాకర్, పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ స్వాతిసాయి, నిజాముద్దీన్, ఫృద్వీ, హెచ్‌ఓ షఫివున్నీషా బేగం, ఏఎంఓ వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన భాగవత సప్తాహం

వీరపునాయునిపల్లె : మండలంలోని సంగాలపల్లెలో వెలసిన శ్రీకృష్ణ గోశాలలో వారం రోజులుగా చేపడుతున్న భాగవత సప్తాహం బుధవారంతో ముగిసింది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు గోశాల నిర్వాహకుడు రాజశేఖర్‌రెడ్డి అన్నదానం ఏర్పాటు చేశారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కమలాపురం : వ్యక్తి గత పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి నాగలక్ష్మీరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని సంబటూరు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు డెంగ్యూ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారానికి ఒక సారి తొట్లు, బానలు, కుండలు శుభ్రం చేసుకోవాలన్నారు. వర్షా కాలం రానుండటంతో జ్వరాలు, ఒళ్లు నొప్పులు వస్తే తక్షణం ఆసుపత్రులకు వెళ్లాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం జానకి, హెల్త్ అసిస్టెంట్ జయాకర్, ఆశాలు పాల్గొన్నారు.

ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచాలి

పెండ్లిమర్రి : ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలని జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని మాచునూరు రైతు భరోసా కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. పీఎం కిసాన్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఈకేవైసీలు త్వరగా పూర్తి చేయాలన్నారు. అలాగే పంటల బీమాకు సంబంధించిన రైతుల జాబితా ఆర్‌బీకేలోని నోటీసు బోర్డులో ఉంచాలన్నారు. వ్యవసాయ సహాయకులు రైతులకు అందుబాటులో కేంద్రాల వద్ద తప్పనిసరిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ మాధవి లత, ఏఓలు సుమంత్‌రెడ్డి, బ్లెస్సీ పాల్గొన్నారు.

నూతన రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



నూతన రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న సీకేదిన్నె జడ్పీటీసీ పి.నరేన్ రామాంజులురెడ్డి

చింతకొమ్మదిన్నె : నగర పరిధి 49వ డివిజన్‌లోని పూలవాండ్లపల్లి, రాయలపంతులపల్లి గ్రామాలకు వెళ్లే నూతన రోడ్డు నిర్మాణానికి బుధవారం సీకేదిన్నె జడ్పీటీసీ పి.నరేన్ రామాంజులురెడ్డి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు రాయలపంతులపల్లి, పూలవాండ్లపల్లి గ్రామాలకు రూ.23 లక్షలతో ఈ నిర్మాణ పనులను చేపట్టామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ బండి నిత్యానంద రెడ్డి, మండల కన్వీనర్ గూడ ప్రభాకర్‌రెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ సీనియర్ నాయకులు మాసీమ బాబు, 49వ డివిజన్ ఇన్‌చార్జి మధుసూదన్ రెడ్డి, సచివాలయం కన్వీనర్ కే శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు చేరువైన జగనన్న సురక్ష

పులివెందుల టౌన్ : జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు మరింత చేరువైందని..తద్వారా పనులు వేగవంతంగా పూర్తవుతున్నాయని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌లు తెలిపారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని చెన్నారెడ్డి కాలనీ వార్డు సచివాలయంలో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలు వేగవంతంగా తమ పనులను పూర్తిచేసుకొనే వీలుందన్నారు. ఇలాంటి బృహత్తర కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. నయాపైసా ఖర్చులేకుండా అవసరమైన పత్రాలను ఎలా పొందాలో వివరించారు. అనంతరం ప్రజలకు 11 రకాలకు సంబంధించిన 418 పలు కుల, ఆదాయ, వివాహ, జనన ధృవీకరణ పత్రాలను ఉచితంగా ప్రజలకు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధర్‌రెడ్డి, కౌన్సిలర్లు షాహిదా, సుజాత, కాంతమ్మ, మల్లికార్జున పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : మండల పరిధి బిదినంచర్ల గ్రామ సచివాలయంలో బుధవారం జెడ్పీటీసీ ఝాన్సీరాణి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మార్కెట్ యార్డు చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, మండల స్పెషలాఫీసర్ నాగలింగాచారిలు హాజరై మాట్లాడారు. అనంతరం 202 రకాల సర్టిఫికెట్లను వారు ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు బ్రహ్మనందరెడ్డి, కేశవరెడ్డి, ఎంపీడీఓ కృష్ణమూర్తి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : స్థానిక 6వ సచివాలయంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమంను సచివాలయాల మండల కన్వీనర్ (జేసీఎస్) ఆర్.శ్రీనివాసులు నిర్వహించి మాట్లాడారు. జగనన్న సురక్ష ద్వారా ప్రత్యేక క్యాంపులు నిర్వహించి ప్రజలకు 11 రకాల సేవలను ఎటువంటి సర్వీస్ ఛార్జీలు లేకుండా అందించనున్నారని తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు నరసింహ గౌడ్, సునీల్, సచివాలయ కన్వీనర్ నగేష్, సచివాలయ కార్యదర్శి చరణ్, గృహ సారథులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : పట్టణంలోని నాగులకట్టలోని ఐదు, ఆరు వార్డుల సచివాలయంలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. గ్రామ స్వరాజ్య పాలనకు శ్రీకారం చుట్టిన ఏకైక నాయకుడు మన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. నాడు చంద్రబాబునాయుడు అధికారంలోనికి వచ్చిన తర్వాత మహిళలకు రుణమాఫీ చేస్తానని చేయకుండా వదిలేశారన్నారు. మంచి చేసిన వారిని



పులివెందులలో ప్రజలకు సర్టిఫికెట్లను అందిస్తున్న పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

ప్రజలు ఆదరించాలన్నారు. నాడు అధికారులు ఇళ్ల వద్దకు వచ్చిన దాఖలాలు ఎక్కడలేవన్నారు. వివిధ రకాల సర్టిఫికేట్లతోపాటు రిజిస్ట్రేషన్లు సైతం సచివాలయాలలో జరుగుతాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వర రెడ్డి, వార్డు కౌన్సిలర్లు కుండా సావిత్రి, కుండా లక్ష్మీదేవి, మున్సిపల్ కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డి, కోఆప్షన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : పట్టణంలో అలాగే తిప్పలూరులలో బుధవారం మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సుధీర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. చంద్రబాబునాయుడు బూటకపు హామీలు చెప్పి ప్రజలను మోసం చేశారన్నారు. మిగిలిన ఒక్క శాతం లబ్ధిదారులకు పథకాలు వర్తింప చేసేందుకు సీఎం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్య, ఉపమండలాధ్యక్షుడు ఎం.వెంకటమోహన్‌రెడ్డి, ఎంపీడీఓ భాగ్యలక్ష్మీ, విద్యుత్‌శాఖ ఏఈ సుబ్బయ్య, వ్యవసాయ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్లు తుంగా వెంకట్రామిరెడ్డి, సునీత, కో–ఆప్షన్ సభ్యులు డి.సూర్యనారాయణరెడ్డి, వ్యవసాయ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ తదితరులు పాల్గొన్నారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : మండలంలోని తిమ్మాపురంలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి, తహసీల్దారు వెంకటేశ్వర్లు ప్రజలకు పలు ధృవీకరణ పత్రాలను అందజేశారు. ఇప్పటివరకు మండలంలో 99 మందికి కులధృవీకరణ పత్రాలు, 100 ఆదాయ, 13 ఆధార్ మొబైల్ లింకింగ్, 7 రేషన్‌కార్డుల పత్రాలు అందజేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

కమలాపురంలో..

కమలాపురం : మండలంలోని ఎల్లారెడ్డిపల్లెలో మండల స్పెషలాఫీసర్ నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి సీకే దిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి హాజరై దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు 11 రకాల సర్టిఫికెట్లను అందజేశారు.



జమ్మలమడుగు : ధృవీకరణ పత్రాలను ప్రజలకు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఇంకా అర్హులుగా ఉండి ఎవరికైనా సంక్షేమ పథకాలు అందని వారు ఉంటే వారిని గుర్తించి పథకాలు అందజేసేందుకు జగనన్న సురక్ష... అనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. టీడీపీ హయాంలో కమీషన్లు, లంచాలు ఇచ్చిన వారికే సంక్షేమ పథకాలు ఇచ్చేవారని గుర్తు చేశారు. ఏపీపీఎస్‌సీ బోర్డు మెంబర్ నిమ్మకాలయ సుధాకర్‌రెడ్డి, హార్టికల్చర్ స్టేట్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డిలు మాట్లాడుతూ 2024లో దుష్టశక్తులతో సీఎం జగనన్న యుద్ధం చేయబోతున్నారన్నారు. వలంటీర్లు, గృహ సారథులే యుద్ధ వీరులని, మీరంతా కష్టపడి జగనన్నను గెలిపించాలి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి, జడ్పీటీసీ సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, ఎంపీపీ గండి భారతి, సర్పంచ్ రవి శంకర్, వైస్ ఎంపీపీ చెన్నకేశవరెడ్డి, నాయకులు రాజుపాళెం సుబ్బారెడ్డి, ఎస్సీ పుల్లారెడ్డి, గండి భాస్కర్, హిదాయత్, జగన్‌మోహన్‌రెడ్డి, రణ, బుజ్జన్న, లక్ష్మీనారాయణరెడ్డి, నిఖిల్‌రెడ్డి, విశ్వనాథ రెడ్డి, చంటి, ఎంపీడీఓ చలపతి, తహసీల్దార్ సరస్వతి, ఎంఈఓ బేబి, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వల్లూరులో..

వల్లూరు : మండలంలోని దుగ్గాయపల్లె గ్రామ సచివాలయం ఆవరణలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో రాష్ట్ర అటవీశాఖ డైరెక్టర్ రామన శ్రీలక్ష్మి సచివాలయ పరిధిలోని 133 మందికి 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా పంపిణీ చేసి మాట్లాడారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి పార్టీలకు, కుల మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న సీఎం వైస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ ఫలాలను 100 శాతం అందించడమే ధ్యేయంగా జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జుబేద, తహసీల్దార్ శంకర్‌రావు, ఈఓపీఆర్‌డీ ప్రసాద్, సర్పంచ్ పెద్దక్క, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నూరులో..

చెన్నూరు : మండలంలోని ఓబులంపల్లె గ్రామ సచివాలయంలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో చింతకొమ్మదిన్నె జెడ్పీటీసీ పోచంరెడ్డి నరేన్ రామాంజులురెడ్డి పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేద ప్రజలకు మరింత సేవలు అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. అనంతరం బలసింగాయపల్లి గ్రామపంచాయతీలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్ సీహెచ్ వెంకటసుబ్బయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ ముదిరెడ్డి దిలీప్‌రెడ్డి, సర్పంచ్ చల్లా ప్రమీల, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, చల్లా శివారెడ్డి, చంద్రఓబుల్‌రెడ్డి, రాష్ట్ర అటవీశాఖ డైరెక్టర్ శ్రీలక్ష్మి, ముదిరెడ్డి సుబ్బారెడ్డి, పెనుబాల వెంకటసుబ్బమ్మ, జేసీఎస్ మండల ఇంచార్జి నిరంజన్‌రెడ్డి, సర్పంచులు, అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ప్రజలకు వరం

పెండ్లిమర్రి : జగనన్న సురక్ష పథకం ప్రజలకు వరం లాంటిందని సీకేదిన్నె జెడ్పీటీసీ పి.నరేన్ రామాంజులరెడ్డి అన్నారు. మండలంలోని గంగనపల్లె గ్రామంలో మంగళవారం జగనన్న సురక్ష పథకం ద్వారా లబ్ధిదారులకు ఉచితంగా సర్టిఫికెట్లను పంపిణీ చేసి మాట్లాడారు. అర్హత ఉండి పథకం రాకుండా ఉంటే ఇప్పడు జగనన్న సురక్ష ద్వారా ఇంటి వద్దకు వచ్చిన అధికారులను అడగవచ్చునన్నారు. గ్రామ సచివాలయాల ద్వారా 11 రకాల సర్టిఫికెట్లు గ్రామ, వార్డు సచివాలయాల్లో ఎలాంటి రుసుము లేకుండా వలంటీర్లు ఇంటి వద్దకు తీసుకుని వస్తారన్నారు. ఈ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, మాజీ మండల ఉపాధ్యాక్షుడు నాగమల్లారెడ్డి, పొలతల చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, తహసీల్దార్ ఉదయభాస్కర్ రాజు, ఎంపీడీఓ జగన్‌మోహన్‌రెడ్డి, సర్పంచ్ సురేఖ, ఎంపీటీసీ సుబ్బరత్నమ్మ, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని చింతకొమ్మదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని అనిమెల గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం 224 మందికి వివిధ రకాల ధృవీకరణ



సింహాద్రిపురం : ప్రజలకు సర్టిఫికెట్లను అందిస్తున్న జెడ్పీటీసీ ఝాన్సీరాణి



గంగనపల్లెలో ప్రజలకు సర్టిఫికెట్లు అందిస్తున్న సీకేదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి



వల్లూరు : సర్టిఫికెట్లను పంపిణీ చేస్తున్న రాష్ట్ర అటవీశాఖ డైరెక్టర్ రామన శ్రీ లక్ష్మి

పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచు నరేష్‌రెడ్డి, రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి, సివిల్ సప్లై డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథ రెడ్డి, ఎంపీటీసీ రాఘవయాదవ్, ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ రమేష్, జగనన్న సురక్ష పరిశీలకుడు హిదాయతుల్లా, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, మండలస్థాయి అధికారులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : మండలంలోని బుగ్గలపల్లి పంచాయతీ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని బుధవారం సీకేదిన్నె జడ్పీటీసీ పి.నరేన్ రామాంజులరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. అనంతరం దరఖాస్తు చేసుకున్న వారికి పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడా ప్రభాకర్‌రెడ్డి, కో కన్వీనర్ కళాయాదవ్, మాజీ కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మండల ఉపాధ్యాక్షుడు గజ్జల సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ నాగముని, ఉప సర్పంచ్ లక్కిరెడ్డి రమణారెడ్డి, ఎంపీటీసీ వెంకటరెడ్డి, కోకటం లక్ష్మీనారాయణరెడ్డి, వర్దిరెడ్డి సురేంద్రారెడ్డి, పల్లా పెంచల్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, బీసీసెల్ నాయకుడు వేణుగోపాల్, ఎస్సీసెల్ నాయకులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపనకు శరవేగంగా పనులు



గండికోటలో జరుగుతున్న హెలిప్యాడ్ పనులు

జమ్మలమడుగు : మండల పరిధిలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన గండికోటలో ఓబెరాయ్ హోటల్స్ యాజమాన్యం నిర్మిస్తున్న 5 స్టార్ హోటల్ శంకుస్థాపనకు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 9వ తేదీన గండికోట పర్యటన సందర్భంగా రెవెన్యూ అధికారులు పనులు పూర్తిచేశారు. రూ.250 కోట్లతో నిర్మించే విల్లాలకు శంకుస్థాపన సీఎం చేయనున్నాడని ఆర్డీఓ జి.శ్రీనివాసులు తెలిపారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు సన్మానం



ప్రతిభ చూపిన దివ్యాంగ విద్యార్థులతో ఎంఈఓ–2 స్టాలిన్ ఐజాక్, తదితరులు

వేంపల్లె : స్థానిక భవిత దివ్యాంగుల కేంద్రంలో చదివి మంచి ప్రతిభ చూపిన విద్యార్థులకు మండల విద్యా శాఖాధికారి–2 స్టాలిన్ ఐజాక్ చేతులమీదుగా చిరు సన్మాన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఐఈఆర్టీ యశోధ ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులు రాజ్‌కుమార్, ముబారక్, గౌస్ బాబా, ఆబియా 10వ తరగతిలో మంచి ఉత్తీర్ణత సాధించారు. అలాగే ఓపెన్ పదవ తరగతిలో సుజాత, అన్వర్‌బాషా, ఇంటర్‌లో సిద్దిక్, స్కైయిబ్ రాసిన విద్యార్థులు ఆలీషా, సాదియా, నజ్మీన్, సుహానలు మంచి ప్రతిభను చూపారు. వీరి ప్రతిభను గుర్తిస్తూ వారి తల్లిదండ్రులకు బహుమతులను అందించారు. ఉర్దూ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఖాజా పర్వీన్ విద్యార్థులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ బండి వీరారెడ్డి, సీఆర్పీ ప్రకాష్ రెడ్డి, హెచ్‌ఎంలు ప్రసాద్, నరసింహారెడ్డి, సీజీవీ సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ నెలాఖరులోగా చేయించుకోవాలి



చెన్నారెడ్డిపల్లెలో మినుము పంటను పరిశీలిస్తున్న జేడీఏ నాగేశ్వరరావు

కమలాపురం : ఈ నెలాఖరులోగా పీఎం కిసాన్ ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని జేడీఏ అయితా నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం మండలంలోని ఎల్లారెడ్డిపల్లెలో జరుగుతున్న పీఎం కిసాన్ ఈకేవైసీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈకేవైసీ పూర్తి కాకపోతే రైతులకు డబ్బులు జమకావన్నారు. ఎన్‌పీసీఐ లింకు లేని వారు వారి అకౌంట్ ఉన్న బ్యాంక్ నందు లింక్ చేసుకోవాలన్నారు. లేనిపక్షంలో పోస్ట్ ఆఫీస్‌లో అకౌంట్ ఓపెన్ చేసుకుంటే ఎన్‌పీసీఐ లింక్ అవుతుందన్నారు. అనంతరం చెన్నారెడ్డిపల్లెలో మినుము పంటను పరిశీలించారు. రసం పీల్చే పురుగు అధికంగా ఉందని దాని నివారణకు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. రైతులకు అవసరమైన ఎరువులను అన్ని ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచుకోవాలని వ్యవసాయ సిబ్బందికి సూచించారు. బిందు సేద్యం, తుంపర్ల సేద్య పరికరాలు కావలసిన రైతులు సంబంధిత ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ నరసింహారెడ్డి, జేడీఏ కార్యాలయ ఏడీఏ మాధవి, ఏఓలు సుమంత్‌రెడ్డి, సరస్వతి, ఏఈఓ దస్తగిరి, వీఏఏ వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

10న వేంపల్లె ఐటీఐలో జాబ్ మేళా

వేంపల్లె : వేంపల్లెలోని కందుల ఓబుళరెడ్డి చారిటీస్ ఐటీఐలో 10వ తేదీన జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రసాదరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ, డిప్లమో చదివిన విద్యార్థులు బ్రాంచ్, ట్రేడ్ అయిన కూడా జాబ్ మేళాకు అర్హులన్నారు. 10వ తేదీన ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయన్నారు. చెన్నైలోని పెద్ద కంపెనీలైన పెనాసోనిక్, ఇండియా జపాన్ లైటింగ్, సూపర్ ఆటో పోర్జ్ లాంటి పెద్ద కంపెనీలలో పనిచేయడానికి నిరుద్యోగులకు అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. అర్హులైన అభ్యర్థులు ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అభ్యర్థులు ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. నెలకు రూ.15వేల జీతం ఉంటుందని తెలిపారు. అలాగే ఉచిత భోజనం, రవాణా, వసతి సౌకర్యం ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు ఐటీఐ ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని కోరారు.

నేడు దర్గా ప్రారంభం

జమ్మలమడుగు : మండలంలోని ఎస్.ఉప్పలపాడు గ్రామంలో నూతన దస్తగిరి దర్గా ప్రారంభ కార్యక్రమంతోపాటు గంధోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్ద మాజీ టీబీహెచ్‌ఎల్‌సీ చైర్మన్ ఉప్పలపాడు శ్రీనివాసులరెడ్డి ఒకప్రకటనలో తెలిపారు. ఇటీవల కురిసిన వర్షానికి గతంలో ఉన్న పాతదర్గా లోపల ఉన్న భారీ వృక్షం పడిపోవటంతో దర్గా పూర్తిగా దెబ్బతింది. దీంతో గ్రామస్తులందరూ నూతన దర్గాను ఏర్పాటు చేసి గురువారం గంధోత్సవం తోపాటు జెండా పండుగను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్నదాన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు.

డిపో గ్యారేజ సమస్యలపై నిరసన

జమ్మలమడుగు : డిపోలోని ఆర్టీసీ ఉద్యోగులు, డిపో గ్యారేజిల వర్కర్స్ సమస్యలకు పరిష్కారం కోరుతూ ఎన్‌ఎంయూఏ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక డిపో గ్యారేజి గేటు వద్ద నిరసన తెలిపి మాట్లాడారు. ఉద్యోగుల న్యాయపరమైన సమస్యలను యాజమాన్యం పరిష్కరించాలని కోరారు.

నేడు జగనన్న సురక్ష కార్యక్రమం

వీరపునాయునిపల్లె : మండలంలోని మొయిళ్లచెరువు, వెల్దుర్తి గ్రామాల్లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు మొయిళ్లచెరువు, మధ్యాహ్నం 12 గంటలకు వెల్దుర్తి గ్రామాల్లో ఉంటుందని ఈ కార్యక్రమానికి నరేన్ రామాంజులరెడ్డి హాజరు కానున్నారని మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

కొప్పోలులో..

వల్లూరు : మండల పరిధిలోని కొప్పోలు గ్రామ సచివాలయ ఆవరణలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో జుబేద ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ప్రజలకు అవసరమైన వివిధ రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందచేయడం జరుగుతుందని తెలిపారు.

ఉపాధ్యాయులకు సన్మానం

వేంపల్లె : స్థానిక భారతి ప్రాథమిక పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు అమరనాథరెడ్డి, మహాలక్షుమ్మలను ఆ పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. బుధవారం పాఠశాల హెచ్‌ఎం ఆంజనేయులు ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బదిలీలు తప్పనిసరి అని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మధ్యాహ్నం విందు భోజనం ఏర్పాటు చేశారు. ఎంఈఓ స్టాలిన్ ఐజాక్, ఉపాధ్యాయులు సంగమేశ్వరరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, కవిత పాల్గొన్నారు.

రూ.50కే కిలో టమాటాలు



ప్రజలకు సబ్సిడీ టమాటాలను అందిస్తున్న పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, వైఎస్ అభిషేక్‌రెడ్డి

పులివెందుల రూరల్ : స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో సబ్సిడీ టమాటకాయల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ విభాగపు రాష్ట్ర కార్యదర్శి వైఎస్ అభిషేక్‌రెడ్డిలు ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో టమాట రూ.140 పలుకుతుండటంతో సామాన్య ప్రజలు కొనలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా సబ్సిడీ కింద రూ.50కి కిలో టమాటాలను పంపిణీ చేస్తున్నారు. టమాటాలు కావాల్సిన వారు ఆధార్ కార్డు తీసుకుని మార్కెట్ యార్డుకు రావాలన్నారు. ఆధార్ కార్డుకు కిలో టమోటాలు చొప్పున పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. ప్రజలు మార్కెట్ యార్డు వద్ద బారులు తీరారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, వైస్ చైర్మన్ సర్వోత్తమరెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, మార్కెట్ యార్డు జేడీ రామాంజనేయులు, డీడీ శ్రీకాంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ డైరెక్టర్ ప్రసాద్‌రెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టర్లు, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

రేపు చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో (రేపు) శుక్రవారం ఉదయం చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవినొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 08568 286189, 9963170177 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

విద్యార్థినులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థినులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం

వేంపల్లె : స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్లస్ విద్యార్థినులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పుస్తకాలను బుధవారం పంపిణీ చేసినట్లు హెచ్‌ఎం నారాయణమ్మ తెలిపారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థినుల కోసం ఉన్నత పాఠశాలలో ఇంటర్ విద్యను ప్రవేశపెట్టిందన్నారు. ప్రతి విద్యార్థిని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మంచి ఉత్తీర్ణత సాధించాలన్నారు. అలాగే విద్యా దీవెన, వసతి దీవెన పథకాలతోపాటు ఉచితంగా పుస్తకాలను కూడా పంపిణీ చేస్తుందన్నారు. విద్యార్థినులు కూడా బాగా కష్టపడి శ్రద్ధతో చదివి ఉన్నత స్థాయికి చేరాలని తమ కలలను సాకారం చేసుకోవాలన్నారు. పీజీటీ అధ్యాపకులు శ్రీనివాసులు, గురున్నాథరెడ్డి, సురేష్‌కుమార్‌రెడ్డి, పద్మావతి పాల్గొన్నారు.

ఎనీటైం మనీ మోడల్ పద్ధతి లాభదాయకం

వేంపల్లె : ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ఎనీటైం మనీ మోడల్ పద్ధతి లాభదాయకంగా ఉంటుందని మాస్టర్‌ట్రైనర్ బాబు తెలిపారు. బుధవారం నేలవరం తాండా గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో రామానాయక్ తనసొంత పొలంలో 20 సెంట్లలో ఎనీటైం మనీ మోడల్ వేయడం జరిగింది. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పలు పంటలు సాగు చేస్తూ నిరంతర ఆదాయం పొందే విధంగా నేల రకంను బట్టి మిరప, టమోట, వంగతోపాటు ముల్లంగి, క్యారట్, బీట్రూట్, అలసంద, గోరు చిక్కుడు, బెండ, మొక్కజొన్న పంటలను సాగు చేయడంవల్ల ప్రతిరోజు రూ.500ల నుంచి రూ.1000లు ఆదాయం పొందవచ్చునని మాస్టర్‌ట్రైనర్ తెలిపారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, లోకేష్‌రాజు, యూనిట్ ఇన్‌చార్జిలు, ఇంటర్నల్ కమ్యూనిటీ ఆర్పీలు పాల్గొన్నారు.